సాక్షి
జోగులాంబ గద్వాల

సోమవారం : 8 జూలై 2024



అధునాతన భవనాలు
పాలమూరు యూనివర్సిటీలో అవసరాలకు తగ్గట్టుగా భవన నిర్మాణాలు చేపడుతున్నారు.

వివరాలు 8లో ▸



.. విశ్వశాంతి మహాయాగం
నాగర్‌కర్నూల్‌లో 83వ విశ్వశాంతి మహా యాగ మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.1 /24.2

వాతావరణం
రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



గద్వాల అర్బన్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండా ఎగరవేశారు. అదేవిధంగా ఏబీసీడీ వర్గీకరణ ఉద్యమం చేపట్టి నేటికీ 30ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు శంకర్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు ఆర్ మోహన్‌లు మాట్లాడారు. ఏబీసీడీ వర్గీకరణ ఉద్యమం చేపడుతూనే వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్లు పెంచుటకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ నాయకులు భాస్కర్, అశోక్, కన్నా, గంజిపేట పరుశరామ్, రంజిత్‌కుమార్, వంశీ తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి



అలంపూర్: నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని మ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీ, మండలంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అలంపూర్ మున్సిపాలిటీకి చెందిన రత్నమ్మకు రూ.2లక్షల, సావిత్రమ్మకు రూ.12500 సీఎం సహాయ నిధి చెక్కులను ఇంటింటికి వెళ్లి అందజేశారు. అలంపూర్ మండలం లింగనవాయికి చెందిన శ్యామలకు రూ.60వేలు, భీమవరంకి చెందిన శాలిబీకి రూ. 23 వేలు, సుల్తానాపురానికి చెందిన వెంకటస్వామికి రూ.30 వేలు, సింగవరం–1కి చెందిన రామంజనేయులకు సీఎం సహాయ నిధి ద్వార వచ్చిన రూ.24 వేల చెక్కును ఇళ్లకు వెళ్లి అందజేశారు. వీరితోపాటు పీఏసీఎస్ చైర్మన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, నాగభూషణం, శ్రీనివాస్ రెడ్డి, రఘు రెడ్డి, చిన్నయ్య, దిలీప్, సిద్ధు, కృష్ణారెడ్డి, నారయణ, రాఘురాం, యుగేందర్, శేఖర్, ఏసన్న, మురళి గౌడ్, లోకేష్ గౌడ్, సుదర్శన్ బాబు, శేఖర్ నాయుడు పాల్గొన్నారు.

ఎక్కడి పనులు అక్కడే!

మున్సిపాలిటీల అభివృద్ధికి గత ప్రభుత్వంలో నిధులు



వడ్డేపల్లిలో పునాదుల వద్దనే నిలిచిన మున్సిపల్ కార్యాలయ భవనం



- సుందరీకరణ, సమీకృత భవనాలకు రూ.60కోట్లు మంజూరు
- కొత్త ప్రభుత్వంలో నిలిచిన పనులు
- అసంపూర్తి పనులతో ప్రజల ఇక్కట్లు

అలంపూర్: ప్రజా సంక్షేమం.. ఆయా ప్రాంతాల అభివృద్ధిపైనే ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంటాయి. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా లక్ష్యాలు అవే కావడంతో పాత ప్రభుత్వం ప్రారంభించిన పనులను కొత్త ప్రభుత్వంలో కొనసాగిస్తారు. కానీ కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడికి అక్కడే నిలిచిపోయాయి. ప్రధానంగా మున్సిపాలిటీల్లో చేపట్టాల్సిన పనులు మరుగునపడ్డాయి. దీంతో గత ప్రభుత్వంలో చేపట్టిన పురపాలికల సుందరీకరణ, సమీకృత మార్కెట్ యార్డులు, కొత్త మున్సిపల్ భవన నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా మారాయి. అసంపూర్తి పనులతో పుర ప్రజల అనునిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సుందరీకరణకు నిరీక్షణ

మున్సిపాలిటీలను అందంగా తీర్చదిద్దడానికి గత ప్రభుత్వం సుందరీకరణ పేరుతో నిధులు కేటాయించడం జరిగింది. మున్సిపాలిటీల ప్రధాన రోడ్లపై డివైడర్‌తోపాటు సెంట్రల్ లైటింగ్ సిస్టం, ప్రధాన రోడ్ల విస్తరణ, సీసీ రోడ్ల నిర్మాణాలు, మున్సిపాలిటీలకు కొత్త భవనాలకు నిధులు కేటాయించింది. జిల్లాలో ఉన్న నాలుగు మున్సిపాలిటీకు కలిపి సుమారు రూ. 37.40 కోట్లను కేటాయించారు. ఇందులో అలంపూర్‌కు రూ. 10 కోట్లు, వడ్డేపల్లికి రూ.10 కోట్లు, అయిజకి రూ.15 కోట్లు, గద్వాలకు సెంట్రల్ లైటింగ్ కోసం రూ. 2.40 కోట్లు కేటాయించారు. అయిజలో రూ.6 కోట్లతో సెంట్రల్ లైటింగ్, 9 కోట్లతో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల పనులు చేపట్టారు. గద్వాల జిల్లా కేంద్రంలో గతంలోనే డివైడర్ విత్ సెంట్రల్ లైటింగ్ పనులు జరగగా వచ్చిన రూ. 2.40 కోట్లతో డివైడర్‌ల నిర్మాణాలు ప్రారంభించారు. అలంపూర్‌లో సుందరీకరణలో భాగంగా డివైడర్ కం సెంట్రల్ లైటింగ్ కోసం రూ. 3.50 కోట్లు, 10 వార్డుల్లో రూ. 5 కోట్ల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలు, డ్రైనేజీలు ఇతర పనులు చేపట్టడం జరిగింది. వడ్డేపల్లిలో రూ. 3.50 డివైడర్ కం సెంట్రల్ లైటింగ్, రూ. 5 కోట్లతో వార్డుల్లో సీసీ రోడ్ల పనులు చేపట్టడం జరిగింది. సుందరీకరణ పనులు గత ప్రభుత్వంలోనే అలస్యంగా ప్రారంభించారు. దీంతో ఎన్నికల సమయానికి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రోడ్లను విస్తరించడానికి ఇరుపక్కల తవ్వి వదిలేశారు. తవ్విన రోడ్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సెంట్రల్ లైటింగ్ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.

సమీకృతం.. బహుదూరం

సమీకృత మార్కెట్ యార్డుల లక్ష్యం బహుదూరమైంది. ఒకేచోట్ల కూరగాయాలు, మార్కెట్, చేపల విక్రయాలు, ఇతర చిరు వ్యాపారాలు నిర్వహించాలని సమీకృత మార్కెట్‌యార్డుల నిర్మాణానికి గత ప్రభుత్వం కసరత్తు చేసింది. నాలుగు మున్సిపాలిటీల్లో రూ.23 కోట్లతో పనులు ప్రారంభించారు. గద్వాలలో 2.30 ఎకరాల్లో 12 కోట్లతో పనులు ప్రారంభించారు. అయిజలో ఎకరా స్థలాన్ని ఎంపిక చేసి రూ. 1.50 కోట్లతో నిర్మాణం పూర్తి చేశారు. అలంపూర్‌లో 2 ఎకరాల స్థలంలో రూ.2 కోట్లతో గతంలో పనులు ప్రారంభించారు. వడ్డేపల్లిలో ఎకరా స్థలంలో రూ. 2 కోట్ల వ్యయంతో మార్కెట్ యార్డు దుకాణ సముదాయాల పనులు ప్రారంభించారు. గద్వాల, అయిజలో సమీకృత మార్కెట్ యార్డుల నిర్మాణాలు పూర్తికాగా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. వడ్డేపల్లి, అలంపూర్ పునాదుల వద్దనే పనులు నిలిచిపోయాయి.

నిర్మాణ దశలోనే పుర భవనాలు

మున్సిపాలిటీల పాలన సాగించేందుకు కొత్త భవనాల నిర్మాణాలు అందుబాటులోకి రాలేదు. కొత్త మున్సిపాలిటీల్లో భవన నిర్మాణాలు ప్రారంభం కాగా మరొక మున్సిపాలిటిల్లో ప్రతిపాదనలకే పరిమితమైంది. మూడు మున్సిపాలిటీల్లో కొత్త పురపాలికల భవనాల నిర్మాణానికి రూ. 8 కోట్ల వరకు వెచ్చించారు. సుందరీకరణలో భాగంగా వచ్చిన నిధుల్లోనే అలంపూర్‌లో భవన నిర్మాణానికి రూ. 1.50 కోట్లు, వడ్డేపల్లిలో రూ. 1.50 కోట్లు, అయిజలో రూ.5 కోట్లు కేటాయించారు. అలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటిల్లో భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. కానీ ఆ పనులు పునాదుల వద్దనే ఆగాయి. అయిజలో మున్సిపల్ భవన నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. దీంతో పాలన సాగించడానికి కావాల్సిన భవనాల నిర్మాణాలు కలగానే మారుతోంది. అయిజ, వడ్డేపల్లిలో పాత పంచాయతీ భవనాల్లో, అలంపూర్‌లో ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పుర కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.



అలంపూర్‌లో మధ్యలో నిలిచిన సమీకృత మార్కెట్ యార్డు సముదాయం

కాంట్రాక్టర్ల జాప్యంతోనే..



మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తున్నాం. వారి జాప్యంతోనే ఈ పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాలు మారడంతో కాంట్రాక్టర్లు పనుల విషయంలో అలసత్వం వహిస్తున్నారు. పనులు త్వరగా జరిగేలా ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్తాం.

– మనోరమ, మున్సిపల్ చైర్‌పర్సన్, అలంపూర్

పనులు జరిగేలా చూస్తాం



మున్సిపాటీల్లో చేపట్టాల్సిన అసంపూర్తి పనులు తిరిగి ప్రారంభిస్తాం. ఇక్కడికి ఇటీవల రావడం జరిగింది. గతంలో ఏ కారణాలతో పనులు నిలిచాయో తెలియదు. ప్రభుత్వం నుంచి పనులు ప్రారంభించడానికి ఆదేశాలు రాలేదు. ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు పనులు జరిగే విధంగా చూస్తాం.

– సరస్వతి, మున్సిపల్ కమిషనర్, అలంపూర్

'పాలమూరు'ను పూర్తిచేసి..

ప్రతి ఎకరాకు సాగునీరు



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనరసింహ, పక్కన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

- ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల్లో భూ సేకరణ త్వరగా పూర్తిచేయాలి
- సీఎం పర్యటన నేపథ్యంలో అభివృద్ధి, అసంపూర్తి పనులపై నివేదిక
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనరసింహ
- హాజరైన మంత్రి జూపల్లి, ఎంపీ, ఎమ్మెల్యేలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి జిల్లాకు వరప్రదాయిని అయిన పాలమూరు– రంగారెడ్డితో పాటు మిగతా అన్ని ప్రాజెక్టులను పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, పర్యాటక అభివృద్ధి, స్కిల్ డెవలప్‌మెంట్‌పై నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాసరెడ్డి, వీర్లపల్లి శంకర్, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, పర్ణికారెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, తూడి మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, సాగునీటి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ కలెక్టర్లు విజయేందిర, బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లతో కలిసి సమీక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా అభివృద్ధి, పెండింగ్ సమస్యలపై నివేదిక ఇచ్చేందుకు సమావేశంలో చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 2004 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు కేఎల్ఐ, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్నారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో మహబూబ్‌నగర్, నారాయణపేట, వికారాబాద్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ సహా 1,226 గ్రామాలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉమ్మడి జిల్లాలోని నార్లాపూర్, వట్టెం, కర్వెన, ఏదుల రిజర్వాయర్ పనులు దాదాపు పూర్తి చేసినట్లు వివరించారు. ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు 60 శాతం పూర్తయ్యాయని, మిగతా రిజర్వాయర్ పనులు 95 శాతం, పంపుహౌజ్ పనులు 80 శాతం పూర్తి చేశారన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్‌కు సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ పూర్తి చేయాలని సమావేశంలో కోరారు. ప్రాజెక్టు ప్రతిపాదిత వ్యయం రూ.35,200 కోట్ల నుంచి రూ.55 కోట్లకు పెరిగిందని మంత్రులు పేర్కొన్నారు. షాద్‌నగర్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను సైతం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ప్రాజెక్టులకు సంబంధించి చేయాల్సిన పనులు, ప్రతి పాది వ్యయం బడ్జెట్ గురించి నివేదిక రూపొందించాలని సూచించారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో స్టోరేజీ కోసం 4, 5 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్లు నిర్మించాలని, ఇందుకోసం త్వరగా భూ సేకరణ పనులు చేపట్టాలని వారు ఆదేశించారు.



సమీక్షకు హాజరైన ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, యెన్నం శ్రీనివాసరెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, పర్ణికారెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ తదితరులు

మౌలిక వసతుల కల్పన

వైద్య రంగానికి సంబంధించి మండలాల్లోని పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేయాలని, అన్ని ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలని, క్యాడర్ స్ట్రెంత్ పూర్తిగా మంజూరు చేయాలని మంత్రులు సూచించారు. ఆస్పత్రుల్లో సీటీ స్కాన్, ఎక్స్‌రే, శానిటేషన్, సెక్యూరిటీ, అన్ని పరీక్షలు నిర్వహించేలా చూడాలని ఎమ్మెల్యేలు విన్నవించారు. కేజీబీవీల్లో తాగునీరు, వాష్‌రూం, డైనింగ్, సెక్యూరిటీ, పారిశుద్ధ్యం, ఇతర వసతులు కల్పించాలని కోరారు. తమ తమ నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను ఎమ్మెల్యేలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. నైపుణ్య అభివృద్ధి, మహిళా సాధికారత దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రులు, విద్యాసంస్థలను కలెక్టర్లు తప్పనిసరిగా సందర్శించాలని చెప్పారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆస్పత్రుల నియంత్రణ అథారిటీగా పని చేయాలని, పేదలకు మెరుగైన సేవలు అందించేలా చూడాలన్నారు. ఉమ్మడి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఎంతో అవకాశం ఉందన్నారు. సమావేశంలో మహబూబ్‌నగర్, నారాయణపేట అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, మయాంక్ మిత్తల్, సాగునీటి శాఖ సీఈలు రమణారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రఘునందన్ రావు, ఎస్‌ఈలు చక్రధరం, శ్రీనివాస్, ఏఎస్ఎన్ రెడ్డి, శ్రీనివాసరావు, సత్యశీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనిభారం.. ఒత్తిడి

- ఆర్టీసీ బస్సుల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికుల రాకపోకలు
- 'మహాలక్ష్మి'తో రెట్టింపు అయిన తాకిడి
- అదనపు బస్సు సర్వీసుల కోసం ఫిర్యాదుల వెల్లువ
- ఆర్టీసీ ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి
- బస్సుల కొరతతో సతమతం



సామర్థ్యానికి మించి ప్రయాణికులతో వెళ్తున్న బస్సు

గద్వాల క్రైం: సామర్థ్యానికి మించి బస్సుల్లో ప్రయాణికులు.. గుంతలరోడ్లతో ఇబ్బందులు.. సంస్థను లాభాలకు తీసుకొచ్చేందుకు పైఅధికారుల నిబంధనలు.. మొత్తంగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు తీవ్ర పనిఒత్తిడితో విధులు నిర్వహించాల్సి వస్తోంది. బస్సులలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడం ఏమోకానీ.. సామర్థ్యానికి మించి ప్రయాణికులతో వెళ్లడం, సీట్ల కోసం గొడవలు, గుంతల రోడ్లతో విధులు నిర్వహించడం సిబ్బందికి కత్తిమీద సాములా మారింది. జిల్లాలోని 103 బస్సులతో నిత్యం వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో ప్రయాణికుల సంఖ్య ఎన్నాడు లేనంతగా గద్వాల జిల్లా నుంచి హైద్రాబాద్, కర్నూల్, తిరుపతి, కర్నాటక తదితర సర్వీసులలో పెరిగింది. గతంలో జిల్లా వ్యాప్తంగా నిత్యం 70వేలకు పైగా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వేళ్లే వారు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన అనంతరం ఆర్టీసీ బస్సుల్లో ఆ సంఖ్య రెట్టింపు అయ్యింది. దీనికితోడు విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులకు సమస్యగా మారింది. ఈ క్రమంలో పలువురు విద్యార్థి సంఘాల నాయకులు ప్రత్యేక బస్సు సర్వీస్సులు ఏర్పాటు చేయాల్సిందిగా అధికారులకు వినతి పత్రాలు అందజేస్తున్నారు.

ప్రయాణికులతో కిక్కిరిసి..

గద్వాల డిపో పరిధిలో 103 బస్సులు ఉండగా అందులో ఆర్టీసీ ప్రభుత్వ బస్సులు 56, అద్దె బస్సులు 47 ఉన్నాయి. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో ప్రయాణికుల సామర్థ్యం 50 – 60 మంది వరకు ఉంటుంది. గతంలో సామర్థ్యానికి మించి అదనంగా 10 నుంచి 20 మంది ప్రయాణం చేసేవారు. ప్రస్తుతం పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో 80 నుంచి 100 మంది ప్రయాణం చేస్తున్నారు. ఏ బస్సు చూసిన ప్రయాణికులతో కిక్కిరిపోతున్నాయి. బస్సుల్లో ప్రయాణించడానికి వయస్సు పైబడిన వారు, చిన్న పిల్లలు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సిబ్బంది సైతం అదనపు డ్యూటీలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు సరైన రోడ్డు మార్గాలు లేకపోవడం, కాలం చెల్లిన బస్సులు ఇలా డ్రైవర్లు, కండక్టర్లు తమ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



గుంతలమయంగా మారిన రహదారి

'మహాలక్ష్మి'తో సీట్ల యుద్ధాలు

మహాలక్ష్మి పథకంతో ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండగా.. సీట్ల కోసం మహిళల మాటల యుద్ధాలు, పిడుగుద్దుల వరకు వెళ్తున్నారు. మరోవైపు టిక్కెట్ కొనుగోలు చేస్తున్న పురుషులు కూర్చునేందుకు సీట్లు దొరకడం లేదు. దీనివల్ల వాగ్వాదాలు చోటు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఈ పరిస్థితులు ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు తపనొప్పిగా మారుతున్నాయి. బస్సులో ప్రయాణికుల సంఖ్య ఎక్కువ ఉండడంతో బస్సు ఆలస్యం, కేఎంపీఎల్ రావడం లేదు. డ్రైవర్లు అధికారులకు సమాధానం చేపుకోవాల్సిన దుస్థితి. విపరీతమైన రద్దీ కారణంగా కండక్టర్లు సైతం టికెట్లు ఇచ్చే సమయంలో తీవ్ర ఇబ్బందులు, జీరో టిక్కెట్ ఇచ్చే క్రమంలో తప్పిదాలు చోటు చేసుకుంటున్నాయి.

సమయాన్ని మించి విధులు

డ్రైవర్లు, కండక్టర్లకు గతంలో 8గంటల డ్యూటీ ఉండేది. ప్రస్తుతం పని గంటలలో నిబంధన లేదు. దూర ప్రాంతాలకు వెళ్లిన క్రమంలో అప్ అండ్ డౌన్ కింద 400 కిలోమీటర్లు పడుతుంది. మరోవైపు టార్గెట్ ఒత్తిడి, ఆర్టీసీ బస్సులకు డ్రైవర్లు కేఎంపీఎల్ తీసుకురాక పోతే కౌన్సెలింగ్, కేఎంపీఎల్ ఎందుకు రాలేదని అధికారుల ప్రశ్నలు. కండక్టర్లు మహాలక్ష్మీ పథకంతో పాటు టిక్కెట్లకు టార్గెట్ నిర్దేశిస్తున్నట్లు ఆదేశాలు ఉన్నాయి. దీంతో టార్గెట్ కాకపోతే తాము ఏం చేయగలమని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ ఉద్యోగులు లీవ్‌లు తీసుకోవాలంటే సమస్యే. అటు నిద్ర కరువై అనారోగ్యాల బారిన పడుతున్నారు. కార్మిక యూనియన్లు లేకపోవడంతో డిపోలోని అధికారులు సిబ్బందికి ఇష్టారాజ్యంగా డ్యూటీలు వేయడం పరిపటిగా మారిందన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

అదనపు బస్సులు నడపాలి



బస్సుల్లో ప్రయాణం చేయడం కష్టంగా మారింది. బస్సులలో 80 శాతం మంది మహిళలే ప్రయాణం చేస్తున్నారు. కూర్చోవడానికి సీట్లు దొరకడంలేదు. ప్రత్యామ్నాయంగా కొత్త బస్సులు ఏర్పాటు చేయాలి. ఫుట్‌పాత్‌పై నిలబడి గమ్యస్థానాలకు చేరుతున్నారు.

– క్రిష్ణవేణి ప్రయాణికురాలు గద్వాల.

ఇబ్బందిగా ఉంది



బస్సు మొత్తం మహిళలు సీట్లలో కూర్చోవడంతో పురుషులకు సీట్లు దొరకడంలేదు. డబ్బులు ఇచ్చి టిక్కెట్ తీసుకొని గమ్యస్థానం చేరేవరకు పురుషులు నిల్చోవాల్సి వస్తోంది. మహిళలు సీట్లు దక్కించుకోవడంతో పెద్దలు, వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సీట్లు ప్రత్యేకంగా వీరికి వీరికి అని నిర్ణయించాలి.

– మహేష్ నాగర్‌దొడ్డి గ్రామం.

సమస్యలు అధిగమిస్తాం



గద్వాల డిపో నుంచి బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. సిబ్బందికి సైతం పనిభారం పెరిగిన మాట వాస్తవమే. ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మీ పథకం తర్వత వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారు. బస్సు సర్వీసుల కొరత ఉంది. త్వరలో నూతన బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకువస్తాం. డిపో పరిధిలోని సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదికలు అందించాం. సిబ్బందిపై పనిఒత్తిడి పెరగకుండా చూస్తాం.

– మంజుల, ఆర్టీసీ డిపో మేనేజర్ గద్వాల

కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలి



మాట్లాడుతున్న వెంకటస్వామి

గద్వాల అర్బన్: సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని దశాబ్దాలుగా పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఐటియూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి మండిపడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.లక్షల కోట్ల ఆస్తులు ఉన్న ఎల్ఐసీ, రైల్వే వంటి జాతీయ సంస్థల ప్రైవేటీకరణతో యువత, కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజేపీ ప్రభుత్వం గత పదేళ్లుగా సాగించిన సంస్కరణలు, ప్రైవేటీకరణ, విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు కార్మికులకు వ్యతిరేకంగా చేసిన చట్టాలను వేగంగా అమలు పర్చడానికి నిర్ణయాలు తీసుకుంటుందని, దీనికి వ్యతిరేకంగా కార్మికులందరూ ఐక్యంగా ఉండి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ ఈనెల 10వ తేదీన కార్మిక కోరికల దినాన్ని నిర్వహించనున్నామని, అందులో భాగం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో జరిగే ధర్నా కార్యక్రమాల్లో కార్మికులు పెద్ద ఎత్తున్న పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియూ నాయకులు ఉప్పేరు నర్సింహ్మ, బాలకృష్ణ, రంగన్న, వెంకటేష్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

రాజోళి: కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఏ.వెంకటస్వామి అన్నారు. రాజోళిలో ఆదివారం ఆయన కార్మికుల కోర్కెల దినాన్ని విజయవంతం చేయాలని కరపత్రాన్ని విడుదల చేశారు. లక్ష్మన్న,సత్తార్, జయన్న పాల్గొన్నారు.

టూడేస్ లీగ్‌లో ప్రతిభ చాటాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: త్వరలో జరిగే హెచ్‌సీఏ టూడే లీగ్‌లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటాలని మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. జిల్లాకేంద్రం పిల్లలమర్రి సమీపంలోని ఎండీసీఏ మైదానంలో ఆదివారం హెచ్‌సీఏ టూడే లీగ్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్–25 క్రికెట్ క్రీడాకారుల ఎంపికలను ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీఏ టూడే లీగ్‌లో గతంలో జిల్లా జట్టు మెరుగైన ప్రదర్శన కనబరిచారని, ఎంపికైన క్రీడాకారులు టూడేస్ లీగ్‌లో రాణించాలని కోరారు. 100మంది పాల్గొనగా 33 మందితో ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశామన్నారు.

క్లుప్తంగా

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

పురుగు మందు తాగిన యువకుడు

- చికిత్స పొందుతూ మృతి


రామకృష్ణ(ఫైల్)

మానవపాడు: తాగుడుకు బానిసై.. తండ్రి డబ్బులు ఇవ్వనందుకు పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గోకులపాడులో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మానవపాడు మండలంలోని గోకులపాడుకి చెందిన బోయ రవికుమార్(31) ఆరు నెలల నుంచి తాగుడుకు బానిసై ఈ నెల రెండో తేదీన రాత్రి 8 గంటలకు ఇంటి తాగి వచ్చి, మళ్లీ తాగటానికి తండ్రిని డబ్బులు అడిగాడు. తండ్రి డబ్బులు ఇవ్వకపోవడంతో బయటకు వెళ్లి పురుగు మందు తాగి ఇంట్లోకి వచ్చి పడుకున్నాడు. నోటి నుంచి నురుగ రావడంతో దగ్గరకు వెళ్లి చూడగా.. పురుగు మందు తాగినట్లు గుర్తించారు. వెంటనే రామకృష్ణను చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. తండ్రి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ తెలియజేశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బల్మూర్: మతిస్థిమితం లేని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలోని బల్మూర్ మండలం పోలిశెట్టిపల్లి శివారులో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపి వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా ఫర్‌ఖ్‌నగర్ మండలం వెలిజర్లకి చెందిన యాదగిరి(39) కొన్ని నెలలుగా మానసిక పరిస్థితి బాగోలేదు. ఈ క్రమంలో ఈ నెల 4న ఇంటొ నుంచి బంధువుల ఇంటికి కల్వకుర్తికి వెళ్లాడు. మరుసటి రోజు ఎవరికి చెప్పకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతుకగా.. ఆదివారం బల్మూర్ మండలంలోని పోలిశెట్టిపల్లి శివారులోని వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని వద్ద ఉన్న ఆనవాళ్లతో గ్రామస్తుల సమాచారం మేరకు, కుటుంబ సభ్యులు వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ షాంద్‌పాష తెలియజేశారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మక్తల్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మక్తల్ పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మక్తల్ మండలం రుద్రసముద్రానికి చెందిన వహిద్(26)కు మక్తల్‌కు చెందిన భారతితో వివాహమైంది. మక్తల్‌లో వారు అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఈ నెల 5న ఇంట్లో భార్యాభర్తలు ఇద్దరు గొడవపడి వహిద్ పురుగు మందు తాగాడు. విషయం బంధువులకు తెలియడంతో వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య భారతి, 8 నెలల పాప ఉంది. ఈ సంఘటనపై మృతుడు సోదారుడు ఖాజామైనొద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలియజేశారు.

విద్యుదాఘాతంతో మహిళ..


శక్రి(ఫైల్)

వెల్దండ: మండల పరిధిలోని ఉబ్బలగట్టు తండాలో ఆదివారం వద్యావత్ శక్రి(54) ఇంటివద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శక్రి వ్యవసాయ పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వచ్చింది. ఇంటి గేట్ తీస్తుండగా ఒక్కసారి విద్యుత్ షాక్‌కు గురై పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రయత్నించే లోపే మృతిచెందిందని పేర్కొన్నారు. ఇంటికి ఉన్న విద్యుత్ వైర్లకు అధిక ఓల్టేజీ సరఫరా కావడంతోనే విద్యుత్ ప్రమాదం జరిగినట్లు వారు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేన్నారు. మృతురాలి భర్తతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

అయిజ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన అయిజ మండలం సంకాపురం స్టేజీ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయభాస్కర్ వివరాల మేరకు.. గట్టు మండలం తుమ్మలపల్లికి చెందిన ఆంజనేయులు (32) అయిజలో వ్యక్తిగత పనులు ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా, గుర్తుతెలియని ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సుజాత, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అధునాతన భవనాలు

పీయూలో నిర్మాణాలు పూర్తయిన కొత్త భవనాలు

- సుమారు 650 మంది విద్యార్థినులు ఉండేలా హాస్టల్ నిర్మాణం
- పీజీ సెట్ ఫలితాలు వచ్చాక సీట్ల కేటాయింపు?
- కొత్త క్యాంటీన్ భవనం, సింథటిక్ ట్రాక్‌లు సైతం పూర్తి
- ఈ విద్యా సంవత్సరం నుంచే అందుబాటులోకి..


పీయూ బాలికల హాస్టల్‌లో పనులను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీకి ప్రతి సంవత్సరం కొత్త కోర్సులు రావడం, విద్యార్థుల సంఖ్య పెరగడంతో అవసరాలు సైతం పెరుగుతూ వస్తున్నాయి. దీంతో అధికారులు విద్యార్థుల అవసరానికి తగ్గట్టుగా కొత్త భవనాల నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే రెండు, మూడేళ్ల క్రితం నిర్మించ తలపెట్టిన భవనాలు ప్రస్తుతం అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా గత కొన్నేళ్లుగా మహిళా విద్యార్థుల సంఖ్య పెరగడంతో హాస్టల్ వసతికి ఇబ్బందికరంగా మారింది. దీంతో కొత్త హాస్టల్ భవన నిర్మాణం చేపట్టగా అన్ని పనులు పూర్తయి.. తుది మెరుగులు దిద్దుకుంటుంది. అయితే పీజీ సెట్ పరీక్ష ఫలితాలు వస్తే మొదటి సంవత్సరం విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోనున్నారు. అందుకోసం హాస్టల్‌లో వసతులను అధికారులు మెరుగుపరుస్తున్నారు. అలాగే అథ్లెటిక్స్ కోసం సింథెటిక్ ట్రాక్, ఫుట్‌బాల్ గ్రౌండ్, తాగునీటి కోసం ట్యాంక్, క్యాంటీన్ సైతం నిర్మిస్తుండగా.. ఇవన్నీ ఈ విద్యా సంవత్సరమే అందుబాటులోకి రానున్నాయి.

650 మంది సామర్థ్యంతో..

పీయూలో మొత్తం 1,460 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో సుమారు 835 మంది బాలికలు ఉన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న కృష్ణవేణి లేడీస్ హాస్టల్ సామర్థ్యం 650 మంది వరకు మాత్రమే ఉంది. దీంతో కలెక్టర్ అనుమతితో పీయూకు పక్కనే ఉన్న దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ శిక్షణ భవనాన్ని అద్దెకు తీసుకుని కొంతమంది విద్యార్థులకు వసతి కల్పిస్తున్నారు. కాగా.. భోజన సదుపాయం మాత్రం కృష్ణవేణి లేడీస్ హాస్టల్‌లోనే ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు మూడు పూటలు ఈ హాస్టల్‌కి వచ్చి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు అధికారులు బాలికల కోసం శాశ్వత ప్రాతిపదికన రూ.10 కోట్ల వ్యయంతో అధునాతన సౌకర్యాలతో మూడంతస్తుల భవనం నిర్మించారు. ప్రస్తుతం పనులు దాదాపు పూర్తి కాగా.. తుదిమెరుగులు అద్దుతున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి లేడీస్ హాస్టల్ పనుల పురోగతిని పరిశీలించారు. వీలైనంత త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు.

ప్రారంభించనున్న సీఎం

పీయూలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. అయితే మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు వస్తున్న నేపథ్యంలో పీయూలో సుమారు రూ.80 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు పూర్తయిన అభివృద్ధి పనుల వివరాలను పీయూ అధికారుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నట్లు తెలుస్తుంది. సోమవారం పర్యటనకు సంబంధించి షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. ఈ విషయమై పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి స్పందిస్తూ అభివృద్ధి పనుల వివరాలను ప్రభుత్వానికి అందించామన్నారు. షెడ్యూల్ వెలువడిన వెంటనే పీయూలో ప్రారంభానికి సంబంధించి ఏర్పాట్లు చేస్తామన్నారు. కాగా అధికారికంగా ఎలాంటి సమాచారం రాలేదని పేర్కొన్నారు.

ఇబ్బందులు రానివ్వం..

పీయూలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండు, మూడేళ్ల క్రితం పలు నిర్మాణాలు చేపట్టగా.. ప్రస్తుతం ఆయా పనులు పూర్తి కావొచ్చాయి. ముఖ్యంగా మహిళా విద్యార్థుల కోసం కొత్తగా హాస్టల్ భవనం నిర్మించాం. ఈ విద్యా సంవత్సరమే ఇది అందుబాటులోకి రానుంది. అలాగే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– మధుసూదన్‌రెడ్డి, రిజిస్ట్రార్, పీయూ

రూ.3.50 కోట్లతో క్యాంటీన్..

పీయూలో ప్రారంభం నుంచే క్యాంటీన్ వసతి లేదు. దీంతో విద్యార్థులు చిన్నపాటి సామాగ్రి, ఇతర అవసరాలు ఉంటే కిలోమీటర్ దూరంలోని బండమీదిపల్లికి వెళ్లాల్సి వచ్చేది. దీంతో పీయూలో శాశ్వత ప్రాతిపదికన రూ.3.5 కోట్లు వెచ్చించి క్యాంటీన్ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు తుది దశకు చేరుకోగా మరో నెల రోజుల్లో అందుబాటులోకి రానుంది. అలాగే విద్యార్థులకు సరిపడా నీరు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తేవి. దీంతో పీయూలో అధికారులు శాశ్వత పరిష్కారం కోసం ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించారు. దీనికి త్వరలోనే మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వనున్నారు. ట్యాంక్ అందుబాటులోకి వస్తే పీయూలో ఉన్న మూడు పాత, ఒకటి కొత్త హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం నీటి సరఫరా చేయవచ్చు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ.. అన్నదమ్ముళ్ల దుర్మరణం


మొగులయ్య


లక్ష్మయ్య

కోయిల్‌కొండ: ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ముళ్లు దుర్మరణం పాలయ్యారు. కోయిల్‌కొండ మండలం పారుపల్లి సమీపంలో ఆదివారం చోటుచేసుకున్న ఈ విషాదకర సంఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని బూర్గుపల్లికి చెందిన ఎల్లప్ప కుమారులు మొగులయ్య(44), లక్ష్మయ్య(32) మహబూబ్‌నగర్‌లో కూలీ పనులు చేసుకుంటూ, అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. అయితే వ్యవసాయ పనుల నిమిత్తం ఇద్దరు అన్నదమ్ముళ్లు శనివారం స్వగ్రామానికి వచ్చారు. వ్యవసాయ పనులు పూర్తిచేసుకొని తిరిగి ఆదివారం మహబూబ్‌నగర్‌కు బైక్‌పై వెళ్తుండగా.. మద్దూరు వైపు వెళ్తున్న మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించారు. సోదరుడు గొల్ల కేశవులు ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకేంద్రంలో అక్రమంగా మార్కెటింగ్ బిజినెస్ చేస్తున్న ఓ కంపెనీ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌కు చెందిన మురళి మెటాఫోర్స్ స్పేస్ మార్కెటింగ్ బిజినెస్ పేరుతో జిల్లాకేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తుండగా.. పెట్రోలింగ్ పోలీసులు గుర్తించి ఫిర్యాదు చేశారని, ప్రజలను మోసం చేశారని గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్‌లో పేకాట ఆడుతున్న వారిని అరెస్ట్ చేసినట్లు మాగనూర్ హెడ్‌కానిస్టేబుల్ అర్జున్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్వాట్‌లోని శ్మశానవాటిక సమీపంలోని ఖాళీ ప్రదేశంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న కృష్ణ ఎస్‌ఐ నవీద్, మాగనూర్ పోలీస్ సిబ్బంది వెళ్లి పేకాట ఆడుతున్నట్లు గుర్తించి, నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.42,300 నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మహిళ బలవన్మరణం

జడ్చర్ల: జడ్చర్ల పద్మావతికాలనీలో నివాసం ఉంటున్న పెబ్బేటి బాలీశ్వరీ(36) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్‌కి చెందిన బాలీశ్వరీ తన భర్త గంగయ్యతో కలిసి స్థానిక పద్మావతి కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి భార్యాభర్తలు గొడవ పడ్డారు. మనస్తాపానికి గురైన భార్య గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు బాలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

హిందీ పండితుడు...తెలుగు కవి

- కవిత్వంలో రాణిస్తున్న ఎంఎస్ విజయ్‌కుమార్
- హిందీ, తెలుగులో రచనలు
- విద్యార్థుల కోసం పుస్తకాలు


కర్నూల్‌లో శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో సన్మానం అందుకుంటున్న విజయ్‌కుమార్ (ఫైల్)


స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రానికి చెందిన కవి ఎంఎస్.విజయ్‌కుమార్ హిందీ పండితుడిగా పనిచేస్తూనే మాతృభాషపై అభిమానంతో తెలుగులో కవిత్వం, రచనలు చేస్తున్నారు. విద్యార్థిదశ నుంచి తెలుగుభాషపై పట్టుఉన్న ఈయన కవి, రచయితగా రాణిస్తున్నారు. కవి, ఉగాది సమ్మేళనాలు, తెలుగు మహాసభలు, సదస్సుల్లో పాల్గొని తెలుగులో కవితాగానం చేస్తున్నారు. అదేవిధంగా హిందీలో పలు రచనలు చేశారు.

సమ్మేళనాలు, పురస్కారాలు..

2013లో పాలమూరులో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొని సన్మానం పొందారు. 2017లో హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా నిర్వహించిన బృహత్‌కవి వచనా కవి సమ్మేళనంలో పాల్గొని కవితాగానం చేసి సన్మానం అందుకున్నారు. అదే ఏడాది వనపర్తిలో జరిగిన కాళోజీ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళన, 2018 రాష్ట్రస్థాయి తెలంగాణ జలకవితోత్సవంలో పాల్గొన్నారు. అదేవిధంగా పలు కవి సమ్మేళనాల్లో పాల్గొని కవితాగానం చేశారు. 2020లో హైదరాబాద్‌లో జరిగిన గాంధీ విశ్వసమ్మేళనంలో ఉగాది తెలుగు సమ్మేళనాల్లో పాల్గొని పురస్కారాలు అందుకున్నారు.

పుస్తక రచనలు..

ఈయన పలు పుస్తకాలను రచించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల, లక్ష్యం సాధన కోసం అవసరమయ్యే ఐదు సూత్రాలను పొందుపరుస్తూ 'విజయపథం' పుస్తకాన్ని రెండు విభాగాల్లో ఆవిష్కరించారు. విజయసాధనకు ఐదు సూత్రాలైన ప్రణాళిక, ఆత్మవిశ్వాసం, పట్టుదల, అంకితభావం, కృషి ఎంతగానో ఉపయోగపడుతాయన్న విషయాల గురించి పుస్తకంలో వివరించారు. తెలుగుభాష ఔన్నత్యం, విశిష్టతను తెలియజేసే కవితలు, పండుగలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేసే కవితలను పుస్తకంలో పొందుపరిచారు. అదేవిధంగా తెలుగులో విజయ సోపానలు, విజయ సంకల్పం, విజయ తీరాలు పుస్తకాలు రచించారు. హిందీలో బాలగీతి కవితాయే, కథా సరోవర్, మేరికలం, దేశభక్తి, సాహిత్య సుగంధ్, సాహిత్య తరంగ్, హిందీ సాహితీకే వివిధ్ రూప్, కావ్యధార పుస్తకాలు, ఆజాదికా అమృత్ మహోత్సవం కవితా సంపుటిని రచించారు.



విజయ్‌కుమార్ రచించిన పుస్తకం

విద్యార్థులకు ఉపయోపడేలా..

విద్యార్థుల్లో అంతర్గతంగా దాగివున్న భాషా నైపుణ్యాలను వెలికితీసి అభిరుచిని పెంచేందుకు రచనలు చేస్తున్నా. తెలుగుతోపాటు హిందీలో రచనలు చేశా. పిల్లల వ్యక్తిత్వం, సామర్థ్యాల అభివృద్ధిలో భాష నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుంది. కవితలు, రచనలు విద్యార్థుల్లో మానవీయ సంబంధాలను దృఢంగా నిర్మించడంలో ఎంతో ఉపయోగపడుతాయి. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన దాదాపు 2వేల మంది విద్యార్థులకు తెలుగు సంపుటాలను ఉచితంగా ఇచ్చాను. – ఎంఎస్ విజయ్‌కుమార్, కవి, హిందీ పండితుడు

మహిళాశక్తి క్యాంటీన్లు


కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయనున్న మహిళా క్యాంటీన్ ఇదే..

జిల్లాకు ఐదు మంజూరు

- స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ
- ప్రభుత్వ భవనాలు ఉండాలనే నిబంధన విధింపు
- కలెక్టరేట్‌లో మహిళా క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు
- 9న సీఎం చేతులమీదుగా ప్రారంభం..?

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను లక్షాధికారులు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా చిన్నపాటి వ్యాపారాలు చేసుకునేందుకు విరివిగా రుణాలు అందజేస్తున్న ప్రభుత్వం వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగానే స్వయం సహాయ సంఘాల సభ్యులతో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఐదు చోట్ల వీటిని ఏర్పాటు దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. వీటి నిర్వహణ కోసం ఆసక్తి గల 50 మంది ఎస్ఎస్‌జీ సభ్యులను ఎంపిక చేసి, వారికి హైదరాబాద్‌లో ఇప్పటికే శిక్షణ సైతం ఇచ్చారు. ఇటీవల కలెక్టర్ విజయేందిర జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో మహిళలకు అవగాహన కల్పించారు.

ఆ భవనం తప్పనిసరి..

మహిళా క్యాంటీన్లు ప్రభుత్వ భవనాల్లోనే ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అందుకు అనుగుణంగా ఆయా భవనాలను ఇప్పటికే డీఆర్‌డీఏ అధికారులు గుర్తించారు. ఇందుకోసం కలెక్టరేట్ భవనంలో, మూసాపేట్ మండలం జాతీయ రహదారిపై, జిల్లాకేంద్రం కొత్త బస్టాండ్ చౌరస్తాలోని ద్వాక్రా భవనంలో, జడ్చర్ల, చిన్నచింతకుంట మండలాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో కలెక్టరేట్, మూసాపేట్, ద్వాక్రాకు సంబంధించినవి ప్రభుత్వ భవనాలు కావడంతో ముందుగా వీటిని ప్రారంభించనున్నారు. మిగతా రెండు క్యాంటీన్ల ఏర్పాటుపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తుంది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న క్యాంటీన్లు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన దానికి అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా ఒకే మోడల్‌లో ఉండనున్నాయి. అయితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయనున్న మహిళా క్యాంటీన్‌ను మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

మహిళా సాధికారత దిశగా..

రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా చర్యలు చేపడుతోంది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను లక్షాధికారులను చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం అందుకు అవసరమైన కార్యక్రమాలు రూపొందిస్తోంది. ఇందులో భాగంగానే ఇప్పటికే ఎస్‌హెచ్‌జీలో సభ్యులకు పాఠశాలల విద్యార్థుల యూనిఫాం కుట్టించే బాధ్యత అప్పగించింది. తాజాగా వారితో మహిళా క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటి ఏర్పాటుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ విజయేందిర ఇటీవల జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో వారికి అవగాహన కల్పించారు. కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు డీఆర్‌డీఏ అధికారులు వీటి ఏర్పాటు ప్రక్రియలో నిమగ్నమయ్యారు.

స్థలాలు సైతం గుర్తింపు

జిల్లాలో ఐదు మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ కార్యాలయ సముదాయాలు, ఆలయాలు, మైనార్టీ రెసిడెన్షియల్ గురుకులాలు, జన సంచారం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రూ.85 లక్షల వ్యయంతో 5 క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాలు సైతం గుర్తించారు.


జిల్లా మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ విజయేందిర

ఉమ్మడి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి కృషి


రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వంగూరు: ఉమ్మడి జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి, అచ్చంపేట, కల్వకుర్తి ఎమ్మెల్యేలు డా. వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం కొండారెడ్డిపల్లిలో రూ.28 కోట్లతో డివైడర్‌తో ఫోర్‌లైన్ రోడ్డు, రూ.3 కోట్లతో మిల్క్ చిల్లింగ్ సెంటర్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాను పారిశ్రామికంగానే కాకుండా విద్య, వైద్యం, ఇరిగేషన్ రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ నెల 9న సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లాకు వస్తున్నారని, ఆయనతో జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు సమావేశమవుతున్నట్లు పేర్కొన్నారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు ఉమ్మడి జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. జిల్లాలో మరికొన్ని ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా సమస్యలన్నింటిని సీఎంతో చర్చించి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం సోదరుడు, కొండారెడ్డిపల్లి అభివృద్ధి చైర్మన్ ఎనుముల కృష్ణారెడ్డితో పాటు బాలాజీసింగ్, కేవీఎస్‌రెడ్డి, పండిత్‌రావు, భూపతిరెడ్డి, రమేష్‌గౌడ్, వేమారెడ్డి, కృష్ణారెడ్డి, లాలూయాదవ్ పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

కల్వకుర్తి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తుందని, ప్రధానంగా ప్రజలకు మెరుగైన విద్యావైద్యంతో పాటు రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పరిపాలనా చేస్తుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డా.మల్లురవి అన్నారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని సిల్వర్ జూబ్లీ క్లబ్ ఆవరణలో బృంగి హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెఘా వైద్య శిబిరాన్ని ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ కసిరెడ్డినారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. ప్రజలకు విద్యావైద్యం అందిస్తే వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చాలామంది నేటి సమాజంలో విద్యావైద్యం కోసమే ఎక్కువ డబ్బులు ఖర్చు చేస్తున్నారని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పాలన చేస్తామన్నారు. రాష్ట్రంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్ట్‌లు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలు కసిరెడ్డినారాయణరెడ్డి, డా వంశీకృష్ణ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో కేవలం వైద్య శిబిరాలే కాకుండా, శస్త్రచికిత్సలు నిర్వహించే మెఘా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కార్యక్రమంలో బాలాజీసింగ్, వెంకటరమణారెడ్డి, ఆనంద్‌కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మహానేత వైఎస్సార్ 75వ జయంతి

- ఏపీ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ ఏర్పాట్లు
- ఇడుపులపాయలో నివాళులర్పించనున్న మాజీ సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది. రక్తదానం, పేదలకు వస్త్రాల పంపిణీ, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ, రహదారుల పక్కన మొక్కలు నాటడం వంటి సేవా కార్యక్రమాలను భారీ ఎత్తున చేపట్టేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఏర్పాట్లు పూర్తి చేశాయి. వైఎస్సార్ జిల్లాలోని ఇడుపులపాయలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులు అర్పించనున్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

అండగా ఉంటాం.. ఆందోళనొద్దు

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ధైర్యం చెప్పిన మాజీ సీఎం జగన్
- దుర్మార్గ సంప్రదాయానికి టీడీపీ బీజం వేస్తోంది
- హామీలను విస్మరించి దాడులను ప్రోత్సహిస్తోంది
- అధైర్య పడొద్దు.. బాధితులందరినీ కలుస్తా
- టీడీపీ దౌర్జన్యాలను దీటుగా ఎదుర్కొందాం
- మన కాలం వస్తుంది.. ఓపిగ్గా ఉండండి



వైఎస్సార్‌సీపీ నేతలతో మాట్లాడుతున్న ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కడప: 'టీడీపీ వర్గీయులు అరాచకాలు సృష్టిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను టార్గెట్ చేస్తూ వ్యక్తిగత దాడులు చేస్తున్నారు. కట్టడి చేయాల్సిన ప్రభుత్వం మిన్నకుండిపోయింది. ఇలా ఐదేళ్లలో మనం ఎప్పుడూ దౌర్జన్యాలు చేయ లేదు' అంటూ అనంతపురం జిల్లాకు చెందిన బాధితులు వాపోతుంటే, అధైర్య పడొద్దని.. టీడీపీ దుర్మార్గాలను ధైర్యంగా ఎదుర్కొందామని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు భరోసా కల్పించారు. 'మీ ప్రాంతానికి వస్తా.. మీకు అండగా నిలుస్తా.. ఆందోళన పడొద్దు, అందర్నీ కలుస్తా.. టీడీపీ దుర్మార్గాన్ని దీటుగా ఎదుర్కొందాం' అని ఊరడించారు. ఆదివారం వైఎస్సార్ జిల్లా పులివెందుల క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ జిల్లాతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ శ్రేణులు, నాయకులతో ఆయన మమేకమయ్యారు. అనంతపురం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నేతలు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డి, వీరాంజనేయులు, మగ్బూల్ బాషా, సాంబశివారెడ్డి తదితరులు వైఎస్ జగన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల ఫలితాల అనంతరం ఆ జిల్లాలో చోటుచేసుకున్న పరిణామాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ 'పోరాటాలు మనకు కొత్త కాదు. పోరాటం నుంచే పుట్టిన పార్టీ మనది. ఎంతో కాలం టీడీపీ దౌర్జన్యాలు నడవవు. మనోధైర్యం కోల్పోవద్దు. పార్టీ శ్రేణులకు అండగా ఉండండి. టీడీపీ బాధితులను నేను స్వయంగా కలుస్తా. అండగా నిలుస్తా. టీడీపీ దౌర్జన్యాలను సహించేది లేదు. మనందరం కలసికట్టుగా ఎదుర్కొందాం. మన కాలం వస్తోంది. అంత వరకూ కేడర్‌కు భరోసా ఇవ్వాలి' అని ఆయన పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు.

హామీలను విస్మరించి దాడులకు ప్రోత్సాహం

'ప్రజలకిచ్చిన హామీలను విస్మరించి, చంద్రబాబు సర్కార్ వైఎస్సార్‌సీపీ కేడర్‌ను టార్గెట్ చేసి దాడులను ప్రోత్సహిస్తోంది. గతంలో ఎన్నడూ ఇలాంటి సంస్కృతి లేదు. టీడీపీ సర్కార్ వ్యక్తిగత దాడులకు ఉసిగొల్పుతోంది. ప్రజలన్నీ గమనిస్తున్నారు. ధైర్యంగా ఉండండి. పార్టీ తరుపున అండగా ఉంటాం' అని మాజీ ఎమ్మెల్యేలు ఎస్ రఘురామిరెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి తదితరులతో వైఎస్ జగన్ అన్నారు. చంద్రబాబునాయుడు ఇదివరకెన్నడూ లేని రీతిలో దుర్మార్గ సంప్రదాయానికి బీజం వేస్తున్నారని, పద్ధతి మార్చుకోకపోతే ఫలితం అనుభవించక తప్పదన్నారు.

మాజీ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ

వైఎస్సార్‌సీపీ లింగాల మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ పెద్ద సుబ్బారెడ్డి సతీమణి లక్ష్మీనరసమ్మ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన నేపథ్యంలో వైఎస్ జగన్ ఆదివారం పెద్దకుడాల గ్రామంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులందర్నీ పలుకరించి, ధైర్యం చెప్పారు. లింగాల మండలానికి చెందిన వివిధ గ్రామాలకు చెందిన నాయకుల్ని పేరుపేరునా పలుకరించారు. పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చక్రాయపేట మండలం గొంది గ్రామానికి చెందిన మబ్బు రామయ్య తన పట్టా భూమిలో దౌర్జన్యంగా టీడీపీ వర్గీయులు రోడ్డు వేస్తున్నారని వాపోయారు. అడ్డుకున్న తనపైనే తప్పుడు కేసు బనాయిస్తున్నారని వివరించారు. ఈ ఘటనపై వైఎస్ జగన్ స్పందిస్తూ.. బాధితుడికి అన్యాయం చేయొద్దని పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు ఓపికగా విన్నారు. అవసరమైన చర్యలకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కే సురేష్‌బాబు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- రాజకీయ అంశాలే తప్ప ప్రజాప్రయోజనాలను పట్టించుకోవట్లేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపాటు.. సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీశ్‌రావు ఆరోపించారు. రాజకీయ అంశాలే తప్ప ప్రజాప్రయోజనాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ పాలనలో విద్యా సంస్థల్లో అరకొర వసతులు, టీచర్లకు, పాఠ్యపుస్తకాలకు, దుస్తులకు, తాగునీటికి కొరత ఏర్పడిందని.. వేతనాల చెల్లింపు ఆలస్యం వంటి సమస్యలు విద్యావ్యవస్థను పట్టిపీడిస్తున్నాయని విమర్శించారు. విద్యాశాఖ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్న సీఎం రేవంత్ రాజకీయ అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టట్లేదని హరీశ్‌రావు లేఖలో విమర్శించారు.

ముక్కిపోయిన బియ్యంతో విద్యార్థులకు భోజనమా?

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'మన ఊరు–మన బడి'అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తే దాన్ని కొనసాగించకుండా సీఎం నిర్లక్ష్యం చేస్తున్నారని హరీశ్‌రావు తప్పుబట్టారు. పాఠశాలలో విద్యార్థులకు సన్నబియ్యానికి బదులు ముక్కిన బియ్యంతో భోజనం పెడుతున్నారని.. విద్యార్థుల పౌష్టికాహారం కోసం అందించే కోడి గుడ్ల బిల్లులు సైతం చెల్లించని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఒక్క విద్యార్థి కూడా ఆకలితో అలమటించొద్దనే మనవతా దక్పథంతో 27 వేల పాఠశాలల్లో తమ హయాంలో ప్రారంభించిన 'సీఎం బ్రేక్ ఫాస్ట్'పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించడాన్ని తప్పుబట్టారు. మొత్తంగా కాంగ్రెస్ పాలన టీచర్లకు, విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలలకు శాపంగా మారిందని హరీశ్ దుయ్యబట్టారు. ప్రభుత్వం ఇప్పటికైనా పాఠశాల విద్యను గాడినపెట్టేందుకు చర్యలు తీసుకోవాలని, సమస్యలను పరిష్కరించాలని బహిరంగ లేఖలో హరీశ్ డిమాండ్ చేశారు.

సీఎంకు బహిరంగ లేఖలో హరీశ్ ప్రస్తావించిన పలు డిమాండ్లు

- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద విధులు నిర్వర్తిస్తున్న 54,201 మంది కుక్ కమ్ హెల్పర్లకు ఏడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి.
- ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న భోజన బిల్లులు, కోడిగుడ్ల బిల్లులను తక్షణమే విడుదల చేయాలి.
- ఎస్జీటీల బదిలీల నేపథ్యంలో ప్రాథమిక పాఠశాల్లో ఏర్పడ్డ సుమారు 9 వేల ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి.
- ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ సరఫరా చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలి.
- పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తామన్న సిబ్బందిని నియమించాలి.
- విద్యార్థులకు రెండు జతల యూనిఫాం అందించాలి.
- 'సీఎం బ్రేక్ ఫాస్ట్'పథకాన్ని పునఃప్రారంభించాలి.
- సర్వశిక్షా అభియాన్, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ 4 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి.

వైఎస్సార్ మహోన్నత నాయకుడు

- ఆయన స్మృతిపై రోజూ విచారిస్తూనే ఉన్నాం: ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ



సాక్షి, న్యూఢిల్లీ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిజమైన దేశభక్తుడని, మహోన్నత నాయకుడని ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ కొనియాడారు. మహానేత వైఎస్సార్ 75వ జయంతిని పురస్కరించుకొని ఆమె ఆదివారం ఓ సందేశం విడుదల చేశారు. 'డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భారతదేశ మహోన్నత నాయకుడు. దేశానికి, రాష్ట్రానికి, ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి నిస్వార్థంగా, అంకితభావంతో సేవ చేసిన నిజమైన దేశభక్తుడు. మంచి వ్యక్తిగా, విలువలు ఉన్న సహచరుడిగా వైఎస్సార్ పట్ల మాకు అత్యంత గౌరవం ఉంది. పార్టీ కోసం కలిసి పనిచేసిన గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నా. ప్రజలకు గొప్ప సేవ చేసిన ఆ మహానేత లేరని మనమంతా ప్రతిరోజూ విచారిస్తూనే ఉన్నాం. వైఎస్సార్ దార్శనికత, మార్గదర్శకత్వం నుంచి స్ఫూర్తి పొందుదాం. వైఎస్సార్ జ్ఞాపకాలను కాంగ్రెస్ ఎల్లప్పుడూ గౌరవిస్తోంది. గొప్ప ప్రజా సేవకు బాటలు వేసిన వైఎస్సార్‌కు 75వ జయంతి సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నా' అని సోనియాగాంధీ పేర్కొన్నారు.

ఆ మూడు ఘట్టాలు నా జీవితంలో మరువలేను

టీపీసీసీ అధ్యక్షుడిగా మూడేళ్లు పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్ ట్వీట్



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడిగా తనకు సహకరించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి ఆదివారంతో మూడు వసంతాలు పూర్తయ్యాయి. నాడు నాపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన సోనియాగాంధీ, కాంగ్రెస్ అగ్రనేతలందరికీ కృతజ్ఞతలు. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం, సోనియాగాంధీ సారథ్యంలో విజయభేరీ సభ నిర్వహించడం, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం... మూడేళ్లలో ఈ మూడు ఘట్టాలు నా జీవితంలో మరువలేని సందర్భాలు. ఈ ప్రస్థానంలో నాకు సహకరించిన పార్టీ సీనియర్ నేతలు, పార్టీ అధికారంలోకి రావడానికి కఠోర శ్రమ చేసిన లక్షలాది మంది కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీని గెలిపించి ప్రజాపాలనకు నాంది పలికిన నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు.' అని ఆ ట్వీట్‌లో రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

అర్ధరాత్రి ఇండోర్ స్టేడియం కూల్చివేత

పుంగనూరులో కూటమి నేతల పైశాచిక ఆనందం

- హిటాచీలు, జేసీబీలతో విధ్వంసం
- దాదాపు రూ.కోటి విలువైన ఆస్తి నష్టం
- కులమతాలు, పార్టీలకు అతీతంగా నిర్మించిన స్టేడియం కూల్చివేతపై జనాగ్రహం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మధ్యాహ్న భోజన బకాయిలు చెల్లించాం

హరీశ్‌రావు లేఖపై విద్యాశాఖ స్పందన

హైదరాబాద్: మధ్యాహ్న భోజన బిల్లులకు సంబంధించి గత డిసెంబర్ నాటికి ఉన్న రూ. 50 కోట్ల బకాయిలతోపాటు అదనంగా రూ. 50.45 కోట్లను విడుదల చేసినట్లు విద్యా శాఖ స్పష్టం చేసింది. మరో రూ. 53.07 కోట్లు త్వరలోనే విడుదల కానున్నాయని పేర్కొంది. విద్యా శాఖ సమస్యలపై స్పందించాలంటూ సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు రాసిన లేఖకు ఈ మేరకు స్పందించింది. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా మొత్తం 26 వేల పాఠశాలల్లో తొలిరోజే విద్యార్థులందరికీ ఒక జత యూనిఫాం అందజేశామని, రెండో జత యూనిఫాం ఈ నెలాఖరుకు అందిస్తామని విద్యాశాఖ తెలిపింది. గత ప్రభుత్వం బడ్జెట్ కేటాయించకుండానే సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించిందని, అయినప్పటికీ మార్చి నాటికి పెండింగ్‌లో ఉన్న సీఎం బ్రేక్ ఫాస్ట్ బకాయిలు రూ.3.5 కోట్లను విడుదల చేసినట్లు వెల్లడించింది.

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు విడుదల

▶ మొదటి పేజీ తరువాయి

అందుబాటులో ఉంచుతామన్నారు.

టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఫైనల్ కీ కూడా

జూన్ 9న నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఫైనల్ కీని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టింది. ఫైనల్ కీలో 2 ప్రశ్నలను(56, 59) తొలగించారు. 17వ ప్రశ్నకు సమాధానాన్ని 1 అలాగే 3 ఆప్షన్ ఎంచుకున్న వారికి మార్కులు ఇచ్చారు. గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో ఈ పరీక్ష నిర్వహించిన కమిషన్.. ప్రిలిమినరీ కీతోపాటు మాస్టర్ క్వశ్చన్ పేపర్‌ను అభ్యర్థుల లాగిన్‌లో అందుబాటులో ఉంచింది. ఆ తర్వాత అభ్యర్థులనుంచి అభ్యంతరాలు స్వీకరించిన కమిషన్ విషయ నిపుణుల కమిటీని ఏర్పాటుచేసి వారితో చర్చించి తుది కీని తయారుచేసింది. ఈ కీని వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టినట్టు కమిషన్ కార్యదర్శి ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల స్కాన్డ్ ఓఎంఆర్ పత్రాలు కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

జూరాలకు పెరిగిన వరద



జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం


ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వచ్చే వరద ఆదివారం స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. స్థానికంగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టుకు 1,821 క్యూసెక్కుల వరద వచ్చి చేరగా ప్రాజెక్టు నుంచి 131 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.535 టీఎంసీలు ఉన్నట్లు పేర్కొన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగులు..

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో ఆదివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులు ఉన్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల సమాంతర, ఎడమ కాల్వల ద్వారా నీటి సరఫరా లేదని.. తాగునీటి అవసరాలకు రోజుకు 20 క్యూసెక్కుల నీరు వినియోగిస్తున్నామని చెప్పారు.

రైతుల బాధ తీరినట్లేనా?!

- కృష్ణ జింకలకు పరిరక్షణ కేంద్రం
- ముడుమాల్‌లో ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం
- రూ.2.70 కోట్లకు పరిపాలన అనుమతులు



వ్యవసాయ పొలంలో కృష్ణ జింకలు

కృష్ణా: మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణా నదీతీర ప్రాంతాల్లోని రైతులకు కృష్ణ జింకలతో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. వందలాది కృష్ణ జింకలు పంట పొలాల్లోకి ప్రవేశించి, రైతులు విత్తిన విత్తనాలతోపాటు మొలకెత్తిన మొక్కలను తినేస్తున్నాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఒక్కోసారి జింకలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా కృష్ణా మండలం ముడుమాల్ సమీపంలో కృష్ణ జింకల సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు రూ.2.70 కోట్లు మంజూరు చేస్తూ, పరిపాలన అనుమతులు ఇచ్చింది.

రైతులకు తప్పనున్న అవస్థలు..

కృష్ణానది తీర ప్రాంతాల్లో రైతులు ఎక్కువగా ఆరుతడి పంటలపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. ఈక్రమంలో కృష్ణ జింకలు ఆరుతడి పంటలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. మొక్కల దశలో ఒకసారి, కాపు కాసిన తర్వాత మరోమారు జింకలు తినడం వల్ల పంట దిగుబడి పూర్తిగా తగ్గి, రైతులు అప్పులపాలవుతున్నారు. ఒక్కోమారు మొత్తం పంటలను నాశనం చేస్తుండటంతో పంటకు పెట్టిన పెట్టుబడులతో పాటు తమ శ్రమ వృథా అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తమను తీవ్రంగా వేధిస్తున్న సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. కృష్ణా, మాగనూర్, మక్తల్, ఊట్కూర్ మండలాలకు చెందిన రైతులు పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, రైతుల బాధ తీర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. ఆయా మండలాల్లో కృష్ణ జింకలను పట్టుకొని సంరక్షణ కేంద్రానికి తరలించాలని నిర్ణయించింది. దీనిపై నదీ తీర ప్రాంత రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

నిధులు విడుదల కావాల్సి ఉంది..

ప్రభుత్వానికి అటవీ శాఖ పంపించిన ప్రతిపాదనల మేరకు కృష్ణ జింకల సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు రూ. 2.70 కోట్లు మంజూరు చేస్తూ, పరిపాలన అనుమతులు ఇచ్చింది. వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం ఉంది. నిధుల విడుదల విషయం అధికారికంగా వెలువడాల్సి ఉంది. – శ్రీనివాస్, డీఎఫ్‌ఓ

74 ఎకరాల్లో జింకల సంరక్షణ కేంద్రం..

కృష్ణా మండలం ముడుమాల్ సమీపంలోని 192, 194 సర్వే నంబర్లలో గల 74.12 ఎకరాల్లో కృష్ణ జింకల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూముల సర్వే అనంతరం మండల రెవెన్యూ అధికారులు గత డిసెంబర్‌లో జిల్లా అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. అక్కడ జింకల సంరక్షణకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.



ముడుమాల్ శివారులో ప్రభుత్వ భూములను సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

పాలమూరుపై సీఎం ప్రత్యేక శ్రద్ధ



మ్యాప్ ద్వారా సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనరసింహ, చిత్రంలో కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ జానకి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ తదితరులు

- ఈ ఏడాది చివరి నాటికి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదార రాజనరసింహ

పాలమూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని, సామాన్యుడు సర్కార్ ఆస్పత్రిని ఇది నాది అనే ఆలోచన కల్పించే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదార రాజనరసింహ అన్నారు. మహబూబ్‌నగర్ పాత కలెక్టరేట్‌లోని 16.5 ఎకరాల్లో రూ.270 కోట్లతో నిర్మిస్తున్న వెయ్యి పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. హైదరాబాద్ నుంచి నేరుగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి దగ్గరకు చేరుకున్న మంత్రికి కలెక్టర్ విజయేందిర బోయి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఆ తర్వాత ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆస్పత్రి పరిశీలించగా.. నిర్మాణ పనుల గురించి రాష్ట్ర మౌళిక సదుపాయాల సంస్థ ఇంజినీరింగ్ అధికారి, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ మ్యాప్ ద్వారా వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కొత్తగా నిర్మిస్తున్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో 1,003 పడకలు, ఎంసీహెచ్‌లో 220 పడకలు కలిపి మొత్తం 1,225 పడకలకు వైద్యులు, సిబ్బంది, టెక్నీషియన్స్, ఫార్మాసిస్టులతో 600 పోస్టులు అవసరం అవుతాయని, ఈ అదనపు సిబ్బంది నియామానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట జిల్లాల్లోని మెడికల్ కళాశాలల్లో అన్ని వసతుల కల్పించేందుకు కృషిచేస్తామన్నారు. కొత్తగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఈ ఏడాది చివరి నాటికి ప్రారంభించేలా చర్యలు చేపడతామన్నారు. పాలమూరు మెడికల్ కళాశాలలో 175 ఎంబీబీఎస్ సీట్ల నుంచి 200 సీట్ల పెంపునకు అభ్యర్థన ఉందన్నారు. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం 1,225 పడకలు ఉన్నాయని, హెచ్ఆర్ ప్రకారం అదనపు సిబ్బందిని భర్తీ చేస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, డీఎంహెచ్ఓ కృష్ణ, మెడికల్ కళాశాల డైరెక్టర్ రమేష్‌పాల్గొన్నారు.

■ పాలమూరు మెడికల్ కళాశాలలో అదనంగా మరో బాలికల వసృతి గృహంతోపాటు ఆడిటోరియం నిర్మించాలని ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థులు మంత్రికి వినతిపత్రం అందించారు. ఒక్కో వసతి గృహం గదిలో ఐదుగురు విద్యార్థులు ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. 150 నుంచి 175 సీట్లకు పెరగడం వల్ల వసతి గృహాల్లో ఇబ్బంది ఉందని పేర్కొన్నారు.

సందర్శకుల సందడి



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలకళను సంతరించుకోవడం.. ఆదివారం సెలవురోజు కావడంతో సందర్శకుల తాకిడి కనిపించింది. సాయంత్రం వేళ చిరుజల్లులు కురుస్తుండగా.. చిన్నారులు, యువకులు వర్షంలోనే ఐస్‌క్రీం తింటూ సందడి చేశారు. – ధరూరు



ప్రారంభమైన విశ్వశాంతి మహాయాగ మహోత్సవం

- మొదటిరోజు పూజా కార్యక్రమాలు ప్రారంభించిన శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద
- ఈ నెల 21 వరకు కొనసాగనున్న కార్యక్రమాలు

నాగర్‌కర్నూల్: జిల్లాకేంద్రంలోని ఓంనగర్‌కాలనీలో 83వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 21 వరకు జరిగే పూజలను శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద వేదయుక్తంగా ప్రారంభించారు. మొదటిరోజు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన యాగ మండపంలో అర్చకులు అయుత చండీ, అతిరుద్ర మహాయాగ పూజలకు అంకురార్పణ చేశారు. యాగ మండపంలో స్వామీజీ మొదట మహాగణపతి పూజ, పుణ్యాహ వాచనం, దీక్షాధారణ కార్యక్రమాలను ప్రారంభించారు. పంచగవ్య ప్రాసన చేసి దీక్షాధారణ చేపట్టారు. గోపూజ నిర్వహించి భక్తులతో కలిసి యాగశాల ప్రదక్షిణ అనంతరం యాగశాల ప్రవేశం చేశారు. అగ్నిదేవుడిని నమస్కరిస్తూ అఖండ దీపారాధన, తోరణ పూజ, ద్వార పూజ, ద్వార బలి, మాతక పూజ, షోడశస్తంభ ఆవాహన పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సమస్త వాస్తు దోషాల నివారణకు వాస్తు హోమం వేదమంత్రోచ్చారణల నడుమ జరిపించారు. మహిళలు కోలాటాలు, భజనలు లలిత సహస్ర పారాయణం పఠించారు. కార్యక్రమంలో 800 మంది రుత్వికులు, వివిధ ప్రాంతాల భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి..

లోక కల్యాణార్థం జిల్లాకేంద్రంలో కృష్ణజ్యోతి స్వరూపానందస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అయుత, చండీ, రుద్రయాగంతో పాటు కల్యాణాలు, హోమ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి కోరారు. ఆదివారం జరిగిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 83వ అతి రుద్ర మహాయాగం నియోజకవర్గకేంద్రంలో నిర్వహించడం ఎంతో పుణ్యఫలమన్నారు. భక్తుల దాతృత్వంతో నిర్వహిస్తున్న కార్యక్రమం సంకల్ప బలంతో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.



పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి తదితరులు

అడ్డంకులను ఎదుర్కొంటూ ముప్పై ఏళ్లుగా ఉద్యమం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: స్వార్థపరులు కల్పించే అడ్డంకులను ఎదుర్కొంటూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం ముప్పై ఏళ్లుగా కొనసాగుతుందని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తిక్ పేర్కొన్నారు. ఆదివారం పీయూలో పలు విద్యార్థి సంఘాలతో కలిసి ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. భారత్‌లో అతిపెద్ద సామాజిక ఉద్యమంగా నిలిచిందని, ఇన్ని సంవత్సరాల్లో మాదిగ జాతి ఆత్మగౌరవం, అస్తిత్వం, గుర్తింపులతో పాటు మొదటి దశ ఎస్సీ వర్గీకరణకు కృషి చేసినట్లు తెలిపారు. సమాజంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక రాజకీయ అసమానతలను రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పీయూ జేఏసీ చైర్మన్ రాము, ఏఐఎస్ఎఫ్ పీయూ అధ్యక్షుడు పవన్‌కుమార్‌రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.



పీయూ ముఖద్వారం వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు